# ఆనెస్టీ ఇంటర్నేషనల్

"మా కంపెనీలో పని చేయడానికి చిమ్మిరపకాయ లాంటి కుర్రాడు కావాలి! అర్హతలు? నిజాయితీపరుడు, సత్యసంధుడు అయి తీరాలి! లంచములివ్వరాదు, పుచ్చుకొనరాదు. అధికార్లను ఇన్‌ఫ్లూయెన్స్ చెయ్యకూడదు. ఉన్నత ప్రభుత్వోద్యోగులతో కాని, మంత్రులతో కాని, లాలూచీ పడకూడదు! ఇటువంటి సకల సుగుణాభిరాముని కోసం మా కంపెనీ వేటాడుతుంది. జీతం వెయ్యి. అనుభవాన్ని బట్టి అదనంగా యిస్తాం"

ఆనెస్టీ ఇంటర్నేషనల్ (ప్రై) లిమిటెడ్‌వారి ప్రకటన అన్ని దినపత్రికల్లో ప్రముఖంగా పడ్డాది.

"నీ ఆనెస్టీ ఈరోజుల్లో పనికిరాదు. డిసానెస్టీ ఈజ్ ది బెస్ట్ పాలసీ!" అని మిత్రులచేత విమర్శించబడే భోలాశంకరుడికి ఆనెస్టీ కంపెనీవారి ప్రకటన ఆశలు రేకెత్తించింది. ఎప్పాయింట్‌మెంట్ ఫిక్సయాక ఇంటర్వ్యూకి బయల్దేరాడు.

"మా ప్రకటన క్షుణ్ణం గా చదివేరా?" అడిగేడు ఇంటర్వ్యూయింగ్ ఆఫీసరు. అతనే అధినేత కూడా.

"చదివేను సార్"

"ఎల్లప్పుడూ నిజాయితీగా మసలుకోవాలి. ధోకా కొట్టకూడదు"

"నా ఆదర్శమే అది సార్"

"ఎప్పుడూ ఖూనీలు అవీ చెయ్యలేదు కదా?"

"హరహర! ఆ మాటే నా నిఘంటువులో లేదండీ! ఎంత మాటన్నారు!?" మధనపడ్డాడు భోలా శంకరుడు.

"ఉన్నత ప్రభుత్వాధికారులతోను, మంత్రులతోను లాలూచీపడి, కంపెనీకి కళంకం తేకూడదు, తెలిసిందా?"

'కంపెనీకి కళంకం వస్తే, నాకుమాత్రం కళంకం కాదా సార్! అలా అయితే కంపెనీలో తమరుణ్ణిస్తారా?" అన్నాడు భోలాశంకరుడు.

"సరే, ఆర్డర్స్ పంపిస్తాను. మీరు వెళ్లొచ్చు" అన్నాడు ఆనెస్టీ అధినేత.

మర్నాడే భోలాశంకరుడికి పోస్టులో కాయితం వచ్చింది-

"యు రిగ్రెట్ యూ ఆర్ నాట్ సెలెక్టెడ్"

భోలా శంకరుడు బోల్తా పడ్డాడు.

ఆనెస్టీ ఇంటర్నేషనల్ అధినేత 'స్మగ్లర్ ది గ్రేట్' అని అతనికేం తెలుసు?

*'జనసుధ' 5-4-1979*